ఎన్నికల సామగ్రి పంపిణీకి ప్రాధాన్యం

- కలెక్టర్ మాధవీలత, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్
- రాజమహేంద్రవరం అర్బన్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఎన్నికల నిర్వహణ సామగ్రి పంపిణీకి సమగ్ర కార్యాచరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత స్పష్టం చేశారు. బుధవారం దానవాయిపేట ఏస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో రాజమహేంద్రవరం అర్బన్ నియోజక వర్గం కోసం ప్రతిపాదించిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కార్పొరేషన్ కమిషనర్, అర్బన్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.దినేష్‌కుమార్‌తో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్ పంపడంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ముఖ్యమని, ఆ భవనం ఆవరణలోనే తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అక్కడ నుంచి సెక్టార్ వారీగా ఆయా రూమ్‌లకు పోలింగ్ మెటీరియల్ ఈవీఎం, వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్స్ ముందస్తుగా చేర్చి సిద్ధమవ్వాలన్నారు. ఎక్కడికక్కడ సెక్టార్ వారీగా సిబ్బంది, హమాలీలని నియమించాలని మాధవీలత పేర్కొన్నారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ నుంచి డిస్ట్రిబ్యూట్ పాయింట్ వరకూ సామగ్రిని తీసుకుని వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్బన్ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ వివరాలు తెలియజేస్తూ సెక్టార్ వారీగా పోలింగ్ మెటీరియల్ నేరుగా సంబంధిత స్ట్రాంగ్ రూమ్ నుంచి డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వరకూ తీసుకుని వెళ్లడం కోసం ప్రత్యేక డ్రెస్ కోడ్ సెక్టార్ నంబర్‌తో ఇవ్వనున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్, కళాశాల అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తొలగింపు ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఓటర్ల తుది జాబితాలో 0.1 శాతం మేర జరిగిన తొలగింపులపై నియోజకవర్గ స్థాయి వారీగా సంబంధింత ఈఆర్‌వో ద్వారా నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత తెలియజేశారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా తొలగించిన ఓటర్ల జాబితా విషయంలో మరణించిన, షిఫ్టడ్, ఇంతకు ముందు నమోదు చేయడం వల్ల ఫారం–8 ద్వారా జరిగిన వాటిపై రిటర్నింగ్ అధికారులను నుంచి సమగ్ర సమాచారం ఇవ్వాలని ఆదేశించామన్నారు. ఈ నెల 22న ప్రకటించిన ఓటరు జాబితాలో దొర్లిన తప్పులను సరిచేసుకోవడంలో ఈఆర్ఓ నుంచి బీఎల్ఓ వరకు వ్యక్తిగత బాధ్యత వహించాలని తెలియజేశామన్నారు. డిసెంబర్ 10 నుంచి ఫిబ్రవరి 6 వరకు మొత్తం 56,231 ఫారం 6, 7, 8 వచ్చాయని, వాటిలో 28 వేలు పరిష్కారం చేయగా, మిగిలినవి పరిశీలనలో ఉన్నట్టు తెలిపారు. నియోజక వర్గ స్థాయిలో బీఎల్‌వోలతో సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేసినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు జిల్లాలో మరణించిన 37,888 ఓటర్లను జాబితా నుంచి తొలగించామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం అధికారులకు, రాజకీయ నాయకులకు సూచనలు ఇచ్చామన్నారు.

ఉద్యోగుల డేటా నమోదు తనిఖీ


డేటా సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఎన్నికల్లో విధులను నిర్వర్తించేందుకు ఇప్పటి వరకూ 5 వేల మంది అధికారులు, సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగుల సమగ్ర డేటా పర్సనల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీపీఎంఎస్) పోర్టల్‌లో నమోదు చేసినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పీపీఎంఎస్ డేటా నమోదు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను సజావుగా సాగేందుకు ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలన్నారు. జిల్లాలో మొత్తం సుమారు 15 వేల మంది ఉద్యోగుల సమగ్ర సమాచారం పీపీఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉందని, ఇప్పటి వరకూ 5 వేల మంది డేటా ఎంట్రీ చేసినట్టు తెలిపారు. ఈ నమోదు ప్రక్రియలో డీఆర్ఓ జి. నరసింహులు వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన పద్మలత


జగన్‌ను కలసిన పద్మలత, శ్రీనివాసులు, చిత్రంలో మంత్రి వేణు

రాజమహేంద్రవరం సిటీ: పార్టీలో తనకు సముచిత స్థానం కల్పించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆ పార్టీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో డాక్టర్ అనసూరి శ్రీనివాసులతో పాటు కలిశారు. వీరి వెంట రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఉన్నారు.

నేటి మహిళలకు రమాబాయి జీవితం ఎంతో ఆదర్శం


రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: సమాజంలోని మహిళలు రమాబాయి అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. స్థానిక రాజేంద్రనగర్ సచివాలయం వద్ద అంబేద్కర్ ఫెడరేషన్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ 126వ జయంతిని నిర్వహించారు. రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ఈ రోజు మహిళలకు అన్ని విధాలుగా హక్కులు లభించాయన్నారు. అనంతరం రామాబాయి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తాడేపల్లి విజయ్‌కుమార్, దివ్య, సంధ్య, ఉమాదేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

కంబాలచెరువు: స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న రాజమహేంద్రి డిగ్రీ కళాశాలలో శ్రీవాణి దంత వైద్యశాల సౌజన్యంతో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ స్టూడెంట్స్‌కి దంత వైద్యులు అవగాహన కలిగించి, దంతాలను ఏ విధంగా సంరక్షించుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తేతలి సత్య సౌందర్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతి రోజు దంత మంజనంతో దంతాలను శుభ్రం చేసుకోవడం వల్ల ఇతర శరీర భాగాలకు ఏ విధమైన వ్యాధులు దరి చేరవన్నారు. కార్యక్రమం ఎన్ఎస్ఎస్ పీవోలు ఎంకేఎస్.ప్రసాద్, కె. సుధారాణి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, దంత వైద్యశాల సిబ్బంది ప్రసాద్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ తులసీధర్

కడియం: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బీ తులసీధర్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఆటో డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ యూనిఫాం లేకుండా వాహనం నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితర నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్దేశించిన ట్రాఫిక్ రూల్స్‌ను పాటించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

ధవళేశ్వరం: ఫోర్టిఫైడ్ రైస్‌పై బుధవారం ధవళేశ్వరం సచివాలయం–2 వద్ద ధవళేశ్వరం భారత ఆహార సంస్థ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ సంస్థ ధవళేశ్వరం శాఖ మేనేజర్లు ఎస్.సందీప్, కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బలవర్ధక బియ్యం(ఫోర్టిఫైడ్ రైస్) తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఒక కేజీ సాధారణ బియ్యంలో 10 గ్రాముల ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కలుపుతారని వివరించారు. ఈ ఫోర్టిఫైడ్ బియ్యంలో విటమిన్లు, ఐరన్, ఫోలికామ్లం మొదలైన సూక్ష్మ పోషకాలు ఉండడం వల్ల రక్తహీనత, నాడీ సంబంధ వ్యాధుల రాకుండా ఉంటాయని గుణనియంత్రణ(క్యూసీ) మేనేజర్లు జశ్వంత్‌కుమార్, బి.గణపతి వివరించారు.

జగన్ వెంటే మైనార్టీలు


నిజాంను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు, మసీద్ పెద్దలు

ధవళేశ్వరం: మైనార్టీలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని ఆ పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు హమీద్‌భాషా పేర్కొన్నారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన నిజాంను హమీద్‌భాషా ఆధ్వర్యంలో మైనార్టీ సెల్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హమీద్‌భాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. నిబద్ధతతో పనిచేస్తున్న నిజాంను మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో నిజాం మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షట్టర్ భాషా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నాయకులు బాజీ, ఇబ్రహీం, మీరావల్లి, రజామసీద్ అధ్యక్షులు జిలానీ, గౌరవ అధ్యక్షుడు మహ్మద్, మస్తాన్‌బేగ్, సలీం, బాజీ, మున్నా, రబ్బానీ, వల్లి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	సైంధవ్
సూర్యమినీ	:	గేమ్‌ఆన్
సూర్యప్యాలెస్	:	హ్యాపీఎండింగ్ (మార్నింగ్‌షో), ఫైటర్ (మూడుఆటలు)
స్వామి	:	కెమేరామెన్ గంగతో రాంబాబు
శివజ్యోతి	:	అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు
అనుశ్రీ	:	హనుమాన్
రాజా	:	హనుమాన్
ఊర్వశి	:	యాత్ర–2
రంభ	:	కెప్టెన్‌మిల్లర్
మేనక	:	నాసామిరంగ
అప్సర	:	గుంటూరుకారం
కుమారి	:	అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండు
నామవరం		
వీఎస్ మహల్	:	యాత్ర–2
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	యాత్ర–2
కడియం		
వెంకటసూర్య	:	యాత్ర–2

సమస్యల పరిష్కారానికి కృషి


ఒకటో డివిజన్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ భరత్‌రామ్

- ఎంపీ భరత్‌రామ్
- డివిజన్‌లో అధికారులతో పర్యటన

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్రస్థాయిలో సమస్యలుంటే చెబితే తక్షణమే చర్యలు చేపడతానని ఎంపీ మార్గాని భరత్‌రామ్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఒకటో డివిజన్‌లో లాలాచెరువు, సుబ్బారావుపేట వర్కర్స్ కాలనీల్లో స్థానిక నాయకులతో కలసి పర్యటించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతోందీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గతంలో నగరానికి ఇప్పుడు నగరానికి అభివృద్ధిలో వచ్చిన మార్పును గమనించాలన్నారు. ప్రజల ఆశీస్సులు, అభిమానం ఎప్పుడూ తనపై ఉండాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని తననూ జగనన్ననూ గెలిపించాలని ఎంపీ భరత్ రామ్ అభ్యర్థించారు. ఒక చోట డ్రెయినేజీ సమస్యను ఆ ప్రాంత వాసులు ఎంపీ దృష్టికి తీసుకు రాగా వెంటనే ఆర్ఎంసీ అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించి, పరిష్కరించమని ఆదేశించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జి ముప్పాన ప్రభాకర్, రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, నగర మహిళా విభాగ అధ్యక్షురాలు మార్తి లక్ష్మి పాలిక శ్రీను, అజ్జరపు వాసు, మజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పురాతన, చారిత్రక కట్టడాల పరిరక్షణకు భరోసా

- సాంస్కృతిక కార్యక్రమాలకు కళాకేంద్రంలో రాయితీ
- కమిటీ ఆర్గనైజర్ టీకే విశ్వేశ్వరరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: చారిత్రక ఆనవాళ్లను పరిరక్షించుకునేందుకు రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ నిరంతరం కృషి చేస్తోందని ఆర్గనైజర్ టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ప్రదర్శనలు నిర్వహించుకునేందుకు కళా, సాంస్కృతిక సంస్థలకు రూ.10 వేల అద్దెకే ఇచ్చేందుకు నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ అంగీకరించారన్నారు. కళా కేంద్రంలో నాటక ప్రదర్శనకు అనువుగా రూ.10 లక్షలతో తెరల ఏర్పాటుకు కమిషనర్ అంగీకరించారని తెలిపారు. నెలకొకసారి సుబ్రహ్మణ్య మైదానంలో పరిషత్ ద్వారా ఒక నాటక ప్రదర్శన జరిగేటట్లు చూస్తామన్నారు. సుబ్రహ్మణ్య మైదానంలో ఉన్న విక్రమ హాలును ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కళా, సాంస్కృతిక ప్రదర్శనలకు అనువుగా తీర్చిదిద్దాలని సూచించినట్లు చెప్పారు. మనుగడలో లేని దామెర్ల ఆర్ట్ గ్యాలరీ, నేదునూరి గ్రంథాలయాన్ని పునరుద్ధరించి సందర్శకులకు అనువుగా తీర్చిదిద్దాలని సూచించామన్నారు. వీరేశలింగం పుర మందిరాన్ని ఆధునీకరించి, మునుపటిలా అక్కడ నాటకాల రిహార్సల్స్‌కు వెసులుబాటు కల్పించి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. రాజ రాజనరేంద్రుని జ్ఞాపకాలకు వారధిగా ఉన్న సారంగధర మెట్ట ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో కన్వీనర్ వీఎస్ఎస్ కృష్ణకుమార్, కమిటీ సభ్యులు కేకే సంజీవరావు, పీసీఎం పవన్, చుండ్రు వీరభద్ర రావు, ఎల్‌వీ ప్రసాద్, దేశిరెడ్డి బలరాం నాయుడు, ఎస్‌వీవీ రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతన పూర్వక సూర్యారాధనకు ఏర్పాట్లు

10వ తేదీ నుంచి 25 ఆధ్యాత్మిక కార్యక్రమాలు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కుమార్‌శర్మ తదితరులు

సీటీఆర్ఐ: మాఘమాస సందర్భంగా ఈ నెల 10వ తేదీ నుంచి నుంచి 25వ తేదీ ఆదివారం వరకూ నిర్వహించనున్న షోడశ దిన ప్రయుక్త పంచాయతన పూర్వక సూర్యారాధనకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక పేపర్ మిల్ రోడ్డు సీతంపేటలోని యాగ స్థలంలో యాగ నిర్వాహకులు వడలి కుమార్ శర్మ మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 వరకూ ప్రతి రోజు సూర్యనమస్కారాలు, హోమాలు, శత చండీ పారాయణ, సుదర్శన మంత్రానుష్టానం, లక్ష్మీ గణపతి జపం, అష్టద్రవ్య హోమం, రుద్రాభిషేకం తదితర పూజలు జరుగుతాయని ఆయన వివరించారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమై, 9 గంటలకు ఉచిత కుంకుమార్చన, 11 గంటలకు సూర్య తీర్థ ప్రసాద వితరణ చేస్తామని తెలిపారు. ఆయా రోజుల్లో విశేష కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులందరూ పాల్గొని సూర్య భగవానుని అనుగ్రహానికి పాత్రులు కావాలని, అలాగే కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలి


రైతులతో చర్చిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కడియం: వ్యవసాయంపై ఆధారపడిన మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలని గ్రామీణ ఫౌండేషన్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు గజేంద్రరాయ్, డాక్టర్ బీనాలు సూచించారు. జనరేటింగ్ రూరల్ ఆపర్చునిటీస్ ఫర్ ఉమెన్ టు విన్ ఇన్ అగ్రిఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(గ్రో) ప్రోగ్రాంలో భాగంగా సంస్థ ప్రతినిధులు బుధవారం కడియం మండలం దుళ్ల గ్రామంలోని చిట్టూరి చౌదరి వ్యవసాయ క్షేత్రంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా సాగయ్యే వివిధ రకాల పంటలు, పంట కాలంలో ఎదురయ్యే సమస్యలు, మార్కెటింగ్ ఇబ్బందులు, వాటిని అధిగమించేదుకు అనుసరించాల్సిన పద్ధతులను గురించి సంస్థ ప్రతినిధులు, రైతులు చర్చించారు. ఈ సందర్భంగా గజేంద్రరాయ్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా తూర్పు, పశ్చిమ, కృష్ణా, విశాఖ జిల్లాల పరిధిలో రానున్న అయిదేళ్లలో పదివేల మంది మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా తీర్చిదిద్దేందుకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. వీరి ద్వారా పది లక్షల మంది రైతులను చైతన్యపరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు టీఎస్ చంద్రశేఖరరావు, ఆర్. శ్రీనివాసరావు, పి. ప్రశాంత్, శ్రీనివాస్, అమలేశ్వరి, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, స్థానిక రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యలో స్వీయ సామర్థ్యమే చుక్కాని



కార్యక్రమంలో మాట్లాడుతున్న గణేష్ కృప

సీటీఆర్ఐ: విద్యార్థులు విద్యలో స్వీయ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ముంబైకి చెందిన ప్రసిద్ధ మోటివేషనల్ స్పీకర్ గణేష్‌కృప అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో రెడ్ క్రాస్, ఐక్యూఎస్సీ సంయుక్త నిర్వహణలో, బ్రహ్మకుమారిస్ యూత్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్య ద్వారా కల్పన, సృజనాత్మక శక్తులను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. పరమాత్మ, ఆత్మ రెండు ఒకటేనా తెలుసుకోవడానికి చేసే ప్రయత్నం విద్యా లక్ష్యమని అభివర్ణించారు. ప్రతి విద్యార్థి పట్టుదల, స్వావలంబన, ఆత్మవిశ్వాసం, కష్టపడే తత్వం లాంటి అలవాటు చేసుకోవడం ద్వారా సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చునని తెలిపారు. యోగ సాధన శ్వాసక్రియ, మెడిటేషన్ లాంటివి విద్యార్థులలో ఉండే ఒత్తిడిని తొలగిస్తాయని చెప్పారు. ఈ సభను ప్రారంభించిన ఐక్యసి మెంబర్ డాక్టర్ వై స్వర్ణశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు ఒక్క అరగంట చదివితే, మనసు మెదడు అనుసంధానం జరిగి మెడిటేషన్‌గా మారుతుందని తెలిపారు. డాక్టర్ పీవీబీ సంజీవరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో అధ్యాపకులు డాక్టర్ గాలి వెంకటరమణ, డి.నీలిమ, డి.మధులత, ఎమ్మెస్ ఫణి కుమార్, జీవీఎస్ కోటేశ్వరరావు, పల్లి సుధా, ఎస్.రాజ్‌కుమార్, కె.శారద, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

అరాచకం సృష్టిస్తున్న ఆదిరెడ్డి

- గోమాంస విక్రయాలకు ఆయనే అండ
- వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి హబీబుల్లా ఖాన్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హబీబుల్లాఖాన్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం, ధవళేశ్వరం పలు ప్రాంతాల్లో పశుమాసం విక్రయాల వెనుక టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు హస్తం ఉందని, వ్యాపారుల వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూళ్లకు పాల్పడుతూ అరాచకం సృష్టిస్తున్నాడని వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి హబీబుల్లా ఖాన్ ఆరోపించారు. బుధవారం అజాద్ చౌక్ లబాబిన్ లైన్ మసీదులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన అరెస్టు వెనుక వాసు హస్తం ఉందన్నారు. తన స్థలాన్ని అద్దెకు ఇచ్చాను తప్ప తాను ఎలాంటి వ్యాపారం చేయడం లేదన్నారు. టీడీపీలో ఉన్నంత కాలం నేను మంచోడిగా ఆదిరెడ్డికి కనిపించానని, తండ్రీ కొడుకుల వ్యవహారం నచ్చక పార్టీ మారానన్నారు. జాంపేటలో గోమాంస వ్యాపారుల నుంచి ఆదిరెడ్డి వాసుకు నెలకు రూ.2 లక్షల ముడుపులు అందుతున్నాయని ఆరోపించారు. ఇంకా ఎమ్మెల్యే సీటు ఖరారు కాకపోయినా వాసు అప్పుడే అరాచకాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆదిరెడ్డి తండ్రీ కొడుకులు చిట్ ఫండ్‌లో తప్పు చేసి జైలుకు వెళ్లారని, తాను ఏనాడు తప్పు చేసి జైలుకు వెళ్లలేదన్నారు. అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండే తమ మధ్య గొడవలు పెట్టడానికి ఆదిరెడ్డి వాసు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరాచకాలకు పాల్పడుతున్న ఆదిరెడ్డి వాసు వ్యవహారం తన వద్ద సాక్ష్యాధారాలు ఉన్నాయని త్వరలో బయటపెడతానన్నారు. సమావేశంలో ఆరీఫుల్లాఖాన్, గుంటూరు జిలాని, సయ్యద్ ఒమర్ సయ్యద్ బాబులు, సయ్యద్ బషీర్, సల్మాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు చేయూత

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని రసాయశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఆపన్నులకు చేయూత కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమీ జీవకారుణ్య సంఘం, స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో వారికి దుస్తులు, దుప్పట్లు, బియ్యం వంటి నిత్యావసరాలు అందజేశారు. ఇటువంటి కార్యక్రమాలు ఆపన్నులకు సహాయపడడమే కాకుండా ఇచ్చిన దాతలకు ఎంతో మానసిక తృప్తి ఇస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు, డాక్టర్ ఈఎస్ఆర్ఎస్ శర్మ, బి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రకాశం నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ చలో విజయవాడకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే బుధవారం ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాజమండ్రి అధ్యక్ష, కార్యదర్శులు దుర్గ, హావేలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ అరెస్టును సీఐటీయూ జిల్లా కమిటీ ఖండించింది. అరెస్టు అయిన వారిని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారించాలని ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా ఏ ఒక్కటి పరిష్కరించలేదన్నారు. వెంటనే అరెస్టు చేసిన వారిని విడుదల చేసి, ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: ఉరి వేసుకుని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం హౌసింగ్ బోర్డు కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన ఆటో ఓనర్ కమ్ డ్రైవర్ ఉలవలపూడి ఫణికుమార్(31)కు ఇంటికి సమీపంలో ఉన్న జెరీనాతో వివాహేతర సంబంధం ఉంది. అయితే ఆమె సెల్‌ఫోన్‌లో వేరే అబ్బాయితో కలిసి ఉన్న పాటోను ఫణికుమార్ చూసి మనస్థాపానికి గురయ్యాడు. అయితే కొద్దికాలానికి జరీనా అబ్బాయితో వెళ్లిపోవడంతో ఫణికుమార్ మందుకు బానిసయ్యాడు. బుధవారం కుమారుడుని తీసుకుని వచ్చేందుకు ఫణికుమార్ భార్య దుర్గాదేవి పెద్దాపురం వెళ్లింది. ఈలోగా ఫణికుమార్ ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. దుర్గాదేవి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఏఎస్సై భీమేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.